క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

కోహెడరూరల్(హుస్నాబాద్)/గజ్వేల్: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బద్దిపడగ, శనిగరం ఫీడర్‌ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏడీఈ సుధీర్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బస్వాపూర్, పోరెడ్డిపల్లి, ఆరెపల్లి, ముత్తన్నపేట, జ్యోతిరామ్‌తండా, చంద్రనాయక్‌తండా, శనిగరం, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పిడిచెడ్, కొల్గూర్, శేర్‌పల్లి, దిలాల్‌పూర్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజ్ఞాపూర్ విద్యుత్‌శాఖ ఏఈ సత్యం తెలిపారు.

చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భగవాన్



భగవాన్‌ను అభినందిస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్: పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గాజుల భగవాన్‌ను నియమించారు. శనివారం ఆయనను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. భగవాన్ గతంలో రాష్ట్ర పోపా ప్రధాన కార్యదర్శిగాను, రాష్ట్ర చేనేత ఐక్య వేదిక ఉపాధ్యక్షుడిగాను పనిచేశారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు రాజయ్య, నాయకులు సత్యనారాయణ, సత్యనారాయణ, బాలయ్య, రాజేశం తదితరులు ఉన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి ఆర్‌డీడీ పూజలు



పూజలు చేస్తున్న ప్రసాదరావు

బెజ్జంకి(సిద్దిపేట): మార్కెటింగ్‌శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు శనివారం లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. పూజారి మధుసూదనాచారి ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, మల్లేశం, కుమార్, శ్రీనివాస్, రాజు, రమేశ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘స్వయం పాలన’



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఉత్సాహంగా స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు మనోజ, నందకుమార్, ప్రభాకర్ రెడ్డి, వెంకటేశం, శ్రీనివాస్ రెడ్డి, ఎల్లం, స్వప్న, విజయ్ కుమార్, నర్సింహులు, కనకరాజు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



వైభవం.. దీపోత్సవం

వర్గల్(గజ్వేల్): కార్తీక సామూహిక దీపోత్సవంతో శనివారం రాత్రి ఉమారామలింగేశ్వరాలయం అలరారింది. గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దీపోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించి తరించారు.

దుర్గంధం.. దుర్భరం..

అధికారులు, నేతలు స్వచ్ఛ్ సిద్దిపేట సాధన కోసం ప్రచారం చేస్తుంటారు. అందుకోసం అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రజలు సహకరించాలంటూ పిలుపునిస్తుంటారు. అయితే మున్సిపల్ అధికారులు కూడా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉందేందుకు కృషిచేశారు. కాని ప్రస్తుతం పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందా అనేలా కనిపిస్తోంది. నాలుగో వార్డు తదితర చోట్ల చెత్తబండి రాకపోవడంతో చెత్తకుప్పలు వెలుస్తున్నాయి. పందులు సంచరిస్తున్నాయి. మురుగుకాలువల్లో చెత్తా, చెదారం నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



చెత్త చెదారంతో నిండిన మురుగు కాలువ

పశువుల ఆసుపత్రి రోడ్డులో చెత్తకుప్ప



ఎన్సాన్‌పల్లి రోడ్డు పక్క పందుల సంచారం

వృథాగా ‘భగీరథ’



పంతుల్‌తండాలో రోడ్డు పక్కన వృథాగా పోతున్న తాగునీరు

మిషన్ భగీరథ తాగునీరు వృథాగా పోతోంది. అక్కన్నపేట మండలం పంతుల్‌తండాలో రోడ్డుపక్కన ఉన్న ఈ నల్లా నుంచి నీరు వృథాగా పారుతోంది. సురక్షితమైన నీళ్లు రోడ్డు పాలవుతున్నాయని తండావాసులు వాపోతున్నారు. వాటర్ ట్యాంక్‌కు వెళ్లే పైపులకు ఈ నల్లా కనెక్షన్ ఉందని, ట్యాంక్ నింపేందుకు విడుదల చేసిన నీరంతా వృథాగా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్):

కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులకు సూచించారు. వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిట్టుబాటుధర కల్పించడానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ డీడీ ప్రసాద్‌రావు, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పోచయ్య, కుమార్, రాజు, మల్లేశం, శ్రీనివాస్, శరత్, రమేశ్, నవీన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన కాంగ్రెస్ నాయకుడు ఐలేని రాధ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతం కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాధ్యులను శిక్షించి న్యాయం చేయండి



రేణుక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శంకర్

గజ్వేల్‌రూరల్: కులాంతర వివాహం చేసుకున్న కారణంగా తమ కూతురిని ఇబ్బందులకు గురిచేసి, ఆమె మృతికి కారకులైన వారిని శిక్షించి న్యాయం జరిగేలా చూడాలంటూ బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగిన ఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం మైలారానికి చెందిన భాను, ఇదే మండలంలోని మాదారానికి చెందిన రేణుకను కులాంతర వివాహం చేసుకున్నాడు. కుటుంబంలో నెలకొన్న గొడవల కారణంగా రేణుక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో భాను సైతం తాను చనిపోతున్నానంటూ సెల్ఫీ వీడియోలో పేర్కొంటూ అదృశ్యమయ్యాడు. దీంతో తమ కూతురు రేణుక మృతికి భాను, అతడి కుటుంబ సభ్యులే కారణమంటూ మృతురాలి కుటుంబ సభ్యులు శనివారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న సీఐ సైదా అక్కడి చేరుకొని వారికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.

హత్య కేసుగా మార్చాలి: డీబీఎఫ్ నేత శంకర్

కులాంతర వివాహం చేసుకున్న రేణుకపై నమోదు చేసిన ఆత్మహత్య ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును హత్య కేసుగా మార్చి సమగ్ర విచారణ చేపట్టాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రేణుకను హత్య చేశారనే అనుమానం ఉన్నందున హత్య కేసుగా మార్చి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



రాజయ్య(ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని అల్మాజీపూర్‌లో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కనికి రాజయ్య(51) కొన్ని సంవత్సరాల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. అయితే ఇటీవల అనారోగ్య సమస్య మరింత కుంగదీయడంతో గత 15న తన పొలం వద్దకు వెళ్లిన రాజయ్య గుర్తు తెలియని పురుగులమందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. అతడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దులు మృతి



మద్దూరు(హుస్నాబాద్): మృతి చెందిన ఎద్దు

మద్దూరు(హుస్నాబాద్)/చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో రెండు ఎద్దులు మృతి చెందాయి. మద్దూరు మండలం గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన పండగ నర్సయ్య అనే రైతుకు చెందిన ఎద్దు తన పొలం గట్టున మేత మేస్తున్న సమయంలో సమీపంలోని కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. దీంతో రైతు కన్నీరు మున్నీరుగా విలపించాడు. దాని విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు. అదేవిధంగా మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన పండుగ నర్సయ్యకు చెందిన ఎద్దు శనివారం ఉదయం మేత మేస్తున్న క్రమంలో అక్కడే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ఆ ఎద్దు విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. నష్టపోయిన రైతును ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరారు.

పేకాట స్థావరంపై దాడి

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి శివారులోని ఓ పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు శనివారం దాడి చేశారు. ఐదుగురిపై కేసు నమోదుచేసి వారి వద్ద నుంచి రూ.2,040 నగదు, నాలుగు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ షేక్ మహబుబ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సు డ్రైవర్‌కు గాయాలు

గజ్వేల్‌రూరల్: స్కూల్ బస్సును ఓ కోళ్ల వ్యాన్ ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన గజ్వేల్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పిడిచెడ్ రోడ్డు నుంచి గజ్వేల్‌వైపు ఓ ప్రైవేటు స్కూల్ బస్సు వస్తుండగా ప్రభుత్వాసుపత్రి చౌరస్తా వద్ద గజ్వేల్ నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో స్కూల్ బస్సు డ్రైవర్‌తో పాటు ఓ విద్యార్థినికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. స్కూల్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

గజ్వేల్‌రూరల్: వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 7, 11, 15వ వార్డుల్లో యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం వీధి కుక్కల నియంత్రణ కార్యాచరణను చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలకు అవసరమైన టీకాలతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డులలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టాయ్‌లెట్‌లు.. నీటి సరఫరాకు చర్యలు

కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థులకు టాయ్‌లెట్స్, అలాగే నీటి సరఫరా చేయడానికి చర్యలు చేపట్టారు. మండలంలోని వింజపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్‌లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సాక్షి దినపత్రికలో ‘ఒంటికైనా రెంటికైనా.. ఇంటికే’ అనే వార్తా కథనానికి అధికారులు, కాంట్రాక్టర్ స్పందించారు. ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సాక్షి ఎఫెక్ట్



చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి..



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తొగుట(దుబ్బాక): విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి ఎదగ గలరని గుడికందుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అంజిరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వంగ మహేందర్ రెడ్డి సహకారంతో శనివారం పాఠశాలలోని 116 మంది విద్యార్థులకు బ్యాడ్జీలు, 25 మందికి క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. మహేందర్‌రెడ్డి సహకారం మరువలేనిదని, విద్యార్థుల తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, హనుమరెడ్డి, భిక్షపతి, కనకరాములు, అనసూయ, వేణుమాధవ్, శివయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించడం అభినందనీయమని రాజగోపాల్‌పేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కనకయ్య అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను శనివారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పోటీలో తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన పుస్తక సమీక్ష విభాగంలో రమ్య, పాటల పోటీలో రాజేశ్వరి, చిత్రలేఖనంలో వైష్ణవి, వచన కవిత్వంలో వినీత్ గెలుపొందారని చెప్పారు. వారికి నగదు బహుమతి, షీల్డ్‌తోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారని తెలిపారు.

అది మా పూర్వీకుల సమాధుల స్థలం

- మాల సదర్ సభ్యుల ఆందోళన
- హక్కుపత్రం ఇవ్వాలంటూ వినతి



సంఘం సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

సిద్దిపేటజోన్: తమ పూర్వీకుల సమాధులు ఉండే స్థలం తమకే చెందాలని మాల సదర్ సంఘం సభ్యులు వివాదాస్పద స్థలంలో శనివారం ఆందోళన చేపట్టారు. మున్సిపల్ ఏర్పాటు చేసిన బోర్డును సైతం తొలగించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ అర్బన్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానిక ఫిషరీస్‌శాఖ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలం తమదే అంటూ అధిక సంఖ్యలో మాల సదర్ సభ్యులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు పురుషోత్తం, వెంకట్ స్వామి మాట్లాడుతూ తమ పూర్వీకుల సమాధులు ఇక్కడే ఉండేవని, మూడు గుంటల భూమికి గాను ప్రస్తుతం 250 గజాల స్థలం మాత్రమే మిగిలిందన్నారు. ఆ స్థలం మున్సిపాలిటీకి చెందినది అంటూ మున్సిపల్ అధికారులు ఇటీవల బోర్డు ఏర్పాటు చేశారని వాపోయారు. సమస్య పరిష్కారానికి దీపావళి వరకు గడువు ఇచ్చినా అధికారులు స్పదించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారంతా అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని స్థలంపై హక్కు పత్రాన్ని సంఘానికి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, రెవెన్యూ, పోలీసులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

◆ **దూల్మిట్ట విద్యుత్ ఏఈగా రాజు**

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల విద్యుత్ ఏఈగా కె.రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. దూల్మిట్ట ఏఈగా పని చేసిన శ్రీనివాసరావు బదిలీపై పటాన్‌చెరుకు వెళ్లగా ఆయన స్థానంలో దుబ్బాక సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రాజు దూల్మిట్ట ఏఈగా వచ్చారు.

◆ **భూములు లాక్కోవడం సరికాదు**

సిద్దిపేటజోన్: గిరిజనుల భూములను లాక్కొని ఫార్మా సిటీకి అప్పగించడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకుడు వీరనాయక్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగిచర్ల ప్రాంతంలో గిరిజనుల భూముల్లో ఫార్మా సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చూస్తోందని, వ్యతిరేకించే గిరిజనులను భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. బాలు నాయక్, శ్రీకాంత్, సీతారాం నాయక్, రాజేశ్ పాల్గొన్నారు.

◆ **26న అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులు**

హుస్నాబాద్: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నియోజకవర్గ స్థాయి అంబేడ్కర్ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ నవంబర్ 26న భారత రాజ్యాంగం ఆమోదించిన రోజును పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో బహిరంగసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘం నేతలు ప్రకాశ్, చేరాలు, ఎల్లయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **అంబేడ్కర్ విగ్రహం ఊరేగింపు**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గతంలో వాహన ప్రమాదంలో దెబ్బతిన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ స్థానంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విగ్రహాన్ని రంగధాంపల్లి కాలనీ ప్రజలు శనివారం ర్యాలీగా తీసుకువచ్చారు. యువజన సంఘం నాయకులు డప్పు చప్పులతో ఘనంగా ఊరేగించారు. త్వరలోనే విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు.

◆ **సంకల్ప దీక్షను జయప్రదం చేయాలి**

మద్దూరు(హుస్నాబాద్): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈనెల 30న చేర్యాల పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని చేర్యాల జేఏసీ రాజకీయ పార్టీ సంప్రదింపుల కమిటీ సమన్వయకర్త ఆగంరెడ్డి తెలిపారు. మండలంలోని తాజ్‌గార్డెన్‌లో జేఏసీ కన్వీనర్ రామడుగు బాలరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శశిధర్‌రెడ్డి, మల్లేశం, శ్రీధర్‌రెడ్డి, ఉదయ్‌రెడ్డి, యాదగిరి, ఇసాక్, సిద్దయ్య, తాజ్‌మహ్మద్, శౌకత్ పాల్గొన్నారు.

◆ **విద్యార్థులకు చట్టాలపై అవగాహన**

సిద్దిపేటజోన్: మహిళ, బాలల చట్టాలు, హక్కులు, సైబర్ నేరాల గురించి పోలీస్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక అంబిటస్ పాఠశాలలో షీ టీమ్ ఏఎస్‌ఐ కిషన్, మమత, కుమారి వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ఘనంగా సహకార వారోత్సవాలు**

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘంలో శనివారం 71వ అఖిల భారతీయ సహకార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో డీసీఓ నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎరువులు, సాగు పద్ధతులు, రుణాలపై రైతులకు అవగాహన కల్పించారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామంటూ డైరెక్టర్లతో ప్రతిజ్ఞ చేయించారు. రాజలింగారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నర్సింహులు, రవి, నాగులు, యాదయ్య, సీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **మృతురాలి కుటుంబానికి పరామర్శ**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామానికి చెందిన చేప్యాల భాగ్యలక్ష్మి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, అజయ్‌వర్మ రామర్శించి సానుభూతి తెలిపారు. రమేశ్, మహేందర్, హరీశ్, గణేశ్ పాల్గొన్నారు.

◆ **నూతన నియామకం**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని లక్ష్మీపూర్‌లో ఎంఆర్‌పీఎస్ గ్రామ శాఖ కార్యవర్గాన్ని శనివారం ఆ సంఘం మండల ఇన్‌చార్జి పరశురాములు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా బొనగిరి మల్లేశం, ఉపాధ్యక్షులుగా బొనగిరి శంకర్ ఎంపికయ్యారు. భూమయ్య, బాలయ్య, పరశురాములు, ఆనందం పాల్గొన్నారు.

◆ **రేపు ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక**

హుస్నాబాద్‌రూరల్: వివిధ గ్రామాల్లో చేపట్టిన పనులపై 18న మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.